సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం | 3 | జూలై | 2024



ఘనంగా పద్మారాధన

విశాఖ: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



నేత్రపర్వం.. నిత్య కల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి నిత్యకల్యాణాన్ని మంగళవారం విశేషంగా నిర్వహించారు.



పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

పూరీ రథయాత్ర సందర్భంగా పలు ప్రత్యేక రైళ్లు పూరీకి నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

చదువుతోనే మంచి భవిష్యత్తు



గూడలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ సాధ్యమని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని గూడ గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల, స్థానిక గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించారు. విద్యాభ్యాసం చేయించారు. సికిల్ సెల్ ఎనీమియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

పాడేరు ఎమ్మెల్యే మానవత్వం

- ఆటో ప్రమాదంలో క్షతగాత్రులకు సపర్యలు
- ప్రత్యేక వాహనాల్లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు
- మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశం



ఆటోను పైకి లేపుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, సెక్యూరిటీ సిబ్బంది

పాడేరు : మండలంలోని పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాల వద్ద మంగళవారం ఓ ఆటో ప్రమాదానికి గురైంది. అటుగా వెళ్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వెంటనే వాహనాన్ని నిలిపారు. వ్యక్తిగత, సెక్యూరిటీ సిబ్బందితో ఆటో వద్దకు వెళ్లారు. బోల్తాపడిన ఆటోను పైకి లేపి క్షతగాత్రులను బయటకు తీశారు. అక్కడిని వారిని ప్రత్యేక వాహనాల్లో ఇక్కడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి సిబ్బందిని ఫోన్‌లో ఆదేశించారు. మానవత్వంతో సేవలందించిన ఎమ్మెల్యేను పలువురు అభినందించారు.

65 మందికి వైద్యసేవలు



వైద్యశిబిరానికి వచ్చిన రోగులు

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం, శరభవరం కాలనీల్లో మంగళవారం జరిగిన ఫ్యామిలి డాక్టర్ ఉచిత వైద్యశిబిరంలో 65 మందికి వైద్య సేవలు అందజేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించిన మందులు అందజేసినట్టు ఆమె తెలిపారు. సుగర్, బీపీ సమస్యలు ఉన్నవారికి వైద్యసేవలు అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండలాని స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు దోమతెరలు ఉపయోగించాలని వైద్యాధికారి సూచించారు. 104 డీఈవో శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ దేవి, సీహెచ్‌వో పద్మావతి, హెచ్ఎస్ సుధాకర్, హెల్త్‌అసిస్టెంట్ నాని బాబు తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల ఆందోళనకు సంఘీభావం

- గిరిజన గురుకుల అధ్యాపక సంఘం ప్రకటన

జి.మాడుగుల: గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్స్ (సీఆర్టీ)లుగా మార్చు చేయాలని విజయవాడలో చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలియజేస్తున్నట్టు గిరిజన గురుకుల అధ్యాపక సంఘం (టీఆర్‌ఈఐఎల్‌ఎ)రాష్ట్ర అధ్యక్షురాలు ఉషాకిరణ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వైపారయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పదిహేనేళ్లుగా అతిథి ఉపాధ్యాయులు, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, పొరుగు సేవల ఉపాధ్యాయులుగా పేర్లు మారుస్తూ కనీస వేతనాలు అమలు పరచకపోవడం చాలా దారుణమని వారు అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను సీఆర్టీలుగా మార్పు చేయాలని కోరడం సమంజసమని అందుకు అనుగుణంగా గురుకుల అధికారులు సీఆర్టీలుగా మార్చి గురుకులంలో కొనసాగిస్తే గిరిజన గురుకుల విద్యాసంస్థలు ప్రగతిపథంలో నడుస్తాయని వారు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ వైపే మొగ్గు

జిల్లాలో ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో నగదు రహిత లావాదేవీలు క్రమంగా పెరుగుతున్నాయి. మారుమూల గ్రామాల్లో సైతం డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకులు కూడా వీటిని ప్రోత్సహిస్తుండటంతో గిరిజనులు కూడా ఆన్‌లైన్ లావాదేవీలపై మొగ్గుచూపుతున్నారు.

- జిల్లాలో తగ్గిన నగదు లావాదేవీలు
- మారుమూల గ్రామాల్లో అందుబాటులో సమాచార వ్యవస్థ
- సెల్ టవర్ల ఏర్పాటుతో ఇంటర్నెట్ సౌకర్యం
- పెరుగుతున్న డిజిటల్ చెల్లింపులు
- ప్రోత్సహిస్తున్న బ్యాంకులు



ముంచంగిపుట్టులోని సెల్ పాయింట్‌లో డిజిటల్ చెల్లింపు చేస్తున్న కొనుగోలుదారుడు



కాశీపట్నంలో ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద నగదు పొందేందుకు వచ్చిన గిరిజనులు

అనంతగిరి: షాపింగ్ మాళ్లు, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు మారుమూల గ్రామాలకు సైతం విస్తరించాయి. నగదు లావాదేవీల ప్రభావం తగ్గుతుండగా.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే కనిపిస్తున్నాయి. మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరిగేవి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదురహిత లావాదేవీలతో గణనీయమైన మార్పులు వచ్చాయి.

సెల్ టవర్ల ఏర్పాటుతో..

గిరిజన ప్రాంతాన్ని అల్లూరి సీతారామరాజు పేరిట ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు కావడంతో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందాయి. ప్రధానంగా రోడ్లు, సమాచార వ్యవస్థ మెరుగుపడింది. సెల్ టవర్లు ఏర్పాటుకాకముందు సిగ్నల్ కోసం కొండలు, గుట్టలు ఎక్కాల్సి వచ్చేది. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నం. జిల్లావ్యాప్తంగా 2,129 సెల్ టవర్లు ప్రతిపాదించగా, వీటిలో ఇప్పటివరకు 221 అందుబాటులోకి వచ్చాయి. మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయి. దీంతో పాడేరు డివిజన్ పరిధిలో సుమారు 600 గ్రామాలకు పైగా ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. మారుమూల గ్రామాల్లో సైతం ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి.

- ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఆమెజాన్ పే, భారత్‌పే, తదితర పేమెంట్ యాప్‌లను లావాదేవీలకు వినియోగిస్తున్నారు. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంక్, ఇతర నిత్యావసర వస్తువులు దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జ్, విద్యుత్, గ్యాస్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు గిరిజనులు అలవాటు పడ్డారు.
- మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఆన్‌లైన్ చెల్లింపుల్లో అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంతమొత్తం అనేది స్పీకర్ ద్వారా దుకాణాదారుడికి ఖాతాలో జమ అయినట్టుగా వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడింది.

తప్పిన అవస్థలు

మొన్నటి వరకు బ్యాంకుల వద్ద క్యూలో నిలబడి డబ్బులు జమ చేయడం లేదా డబ్బులు తీసుకోవాల్సి వచ్చేది. దీంతో విలువైన సమయాన్ని ప్రజలు గంటల కొద్ది బ్యాంకుల్లోనే గడిపేవారు. ప్రభుత్వాలు డిజిటల్ లావాదేవీలు జరిపేలా చర్యలు తీసుకుంటుండడంతో బ్యాంకులు సైతం అందుకు అనుమతి ఇస్తుండడంతో ప్రస్తుతం లావాదేవీలు ప్రజలకు ఈజీ అయిపోయాయి. డిజిటల్ టెక్నాలజీతో ఇంటి నుంచే బ్యాంకు సేవలను రాత్రి, పగలు తేడా లేకుండా వినియోగించుకుంటున్నారు. ప్రజలకు స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి రాగా, బ్యాంకు లావాదేవీలు నిర్వహించుకునే వెసులుబాటు కలిగింది.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకు తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా నగదురహిత లావాదేవీలు చేస్తూ ఇంటి వద్ద నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. దీనివల్ల బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు సంఖ్య తగ్గిందని, బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులు చెబుతున్నారు. మరోపక్క రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. నూరుశాతం డిజిటల్ జిల్లాగా మార్చేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

బ్యాంకింగ్ సేవలు మరింత విస్తృతం



గతంలో నగదు ఆర్థిక లావాదేవీల కారణంగా బ్యాంక్‌ల వద్ద రద్దీగా ఉండేది. ఖాతాదారులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఎస్‌బీ బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో బీసీ పాయింట్లను ఏర్పాటుచేసింది. దీనివల్ల ఖాతాదారులు బ్యాంక్‌లకు వెళ్లకుండా నగదు వెంటనే తీసుకునేలా వెసులుబాటు కల్పించింది.

– పాలెపు సంజీవరావు, ఎస్‌బీఐ బిజినెస్ కరస్పాండెంట్, కాశీపట్నం

అర్థమయ్యే రీతిలో బోధించాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



కొత్తవలస బాలురు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. స్థానిక కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, మెనూ నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమికస్థాయి నుంచి విద్యాప్రమాణాల్లో మార్పు రావాలని, గిరిజన విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందన్నారు. గతంలోని ఉపాధ్యాయవృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చానని మీ అందరికీ తెలుసునన్నారు. అలాగే అవకాశాలను అందిపుచ్చుకుని, చదువులో ఉత్తమంగా రాణించాలని విద్యార్థులకు సూచించారు. మేము చదివేటప్పుడు కనీస సౌకర్యలేక ఇబ్బందులు పడేవారమని, నేడు కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలు మార్పుచెందాయన్నారు. విద్యార్థుల వినతిమేరకు పాఠశాలలో సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సర్పంచ్ కొర్రా సింహాద్రి, హెచ్ఎం కె.అప్పలస్వామి, సీనియర్ ఉపాధ్యాయులు సోమర, మత్స్యలింగం పాల్గొన్నారు.

మా విన్నపాలను పట్టించుకోండి

- గోదావరి వరద సమీక్షలో ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి
- అత్యవసర రహదారులను త్వరగా నిర్మించాలని సూచన



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు

కూనవరం: వరదల కాలం వచ్చేసింది.. ప్రజల్లో ముంపు భయం పట్టుకుంది. అత్యవసర రహదారుల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంది.. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యాటక లాంచీలతో పని జరగదు.. చిన్న లాంచీలు ఎంతో సురక్షితం.. ఈ మా విన్నపాలను పట్టించు కోండి అంటూ పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధికారులను కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన గోదావరి వరదల సమీక్ష సమావేశంలో వారు పేర్కొన్నారు. ఆకస్మికంగా వరదలు వస్తే రహదారులన్నీ మూసుకుపోతాయని, ప్రత్యామ్నాయ రహదారులు కోతులగుట్ట నుంచి బోదునూరు మీదుగా ఏడుగురాళ్లపల్లి, జిన్నెల గూడెం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బోదునూరు మీదుగా పైదిగూడెంకు, బురదగూడెం నుంచి ఏడుగురాళ్లపల్లి వరకు రహదారులను యుద్ధప్రాతిపదికన నిర్మించాలని కోరారు. పర్యాటక లాంచీలు వరద సమయంలో ఊరికి కిలోమీటరు దూరంలో ఆగిపోతాయని, వాటికి బదులు చిన్నలాంచీలను ఏర్పాటు చేయాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో సోలార్ దీపాలు ఏర్పాటు చేయాలని, మహిళలకు బయో టాయిలెట్లు నిర్మించాలని కోరారు. వరదలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని కోరారు. వీటిపై తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ విషయాలన్నింటినీ చింతూరు ఐటీడీఏ పీవీ కావూరి చైతన్య దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వారి ఆదేశాలను పాటిస్తూ గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొంటామని తెలిపారు. అందుకు కావలసిన ముందస్తు కార్యాచరణ సిద్ధం చేశామని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. అందరం కలిసి సయష్టిగా వరదలను ఎదుర్కొందామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎస్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం హేమంత్, వైస్ ఎంపీపీలు కొమరం పెంటయ్య, బండారు సాంబశివరావు, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి.. అంతలోనే ఉద్యోగ విరమణ



ఇమ్మానియేలును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి: మండలంలో ఉద్యోగ విరమణ పొందిన బోర్నగూడెం ఆశ్రమోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు అడ్డాల ఇమ్మానియేలును తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మండలంలోని బోర్నగూడెం బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం వీడ్కోలు సభ నిర్వహించారు. ఇమ్మానియేలు మండలంలోని పలు పాఠశాలలతో పాటు ఇతర ప్రాంతాల్లోని పలు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో సుమారు 39 ఏళ్ల పాటు పనిచేశారు. కాగా జూన్ 29వ తేదీన ఆయనకు హెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. ఈమేరకు మండలంలోని బోర్నగూడెం ఆశ్రమోన్నత పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. అంతలోనే సర్వీసు పూర్తికావడంతో 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. ఎక్కడికి వెళ్లినా తిరిగి సొంత మండలంలో రిటైర్ కావడం ఎంతో సంతోషంగా ఉందని ఇమ్మానియేలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ, విజయబాబు, వరప్రసాద్, కోటేశ్వరరావు, సత్యనారాయణ, ధర్మరాజు, శివ, రాజుబాబు, సతీష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ



పినకోటలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

అనంతగిరి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ సూచించారు. మండలంలోని మారుమూల పినకోట పీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జీనబాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలు పాఠశాలను సందర్శించారు. నిల్వ నీటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. మలేరియా కేసుల వివరాలను తెలుసుకున్న ఆమె. రికార్డులను పరిశీలించారు. హైరిస్క్ గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మలేరియా కేసులు నమోదుకాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో గిరిజనులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పినకోట గ్రామంలోని గిరిజనులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలని, ఆరోగ్యసూత్రాలు పాటించాలని అవగాహన కల్పించారు. రెండోవిడత పిచికారీ పనుల వివరాలను ఆమె తెలుసుకున్నారు. అదనపు మలేరియా అధికారి ఏజే సత్యనారయణ, వైద్యాధికారులు జి.వెంకటేష్, డి.రూప్‌చంద్, ఎంపీహెచ్‌ఈవో బి.తిరుపతిరావు, గంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ రవిశర్మ, సబ్‌యూనిట్ అధికారి బాబురావు, సావిత్రి పాల్గొన్నారు.

వైద్యాధికారి, ఫార్మసిస్టుపై ఆగ్రహం

- రూడకోట పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ దినేష్‌కుమార్
- బాధ్యతగా పనిచేయాలని హెచ్చరిక
- రూ.12 కోట్లతో చేపట్టిన రహదారుల నిర్మాణ పనుల పరిశీలన
- పలు సమస్యల పరిష్కారానికి హామీ



గిన్నెలకోట గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



దిగువకుమడ పాఠశాలలో టీచర్‌కు సూచనలు ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతులు అందజేస్తున్న బూసిపుట్టు గిరిజనులు



వృద్ధుడు బాలంనాయుడిని ఎత్తుకున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పెదబయలు: ఆస్పత్రి రికార్డులు సక్రమంగా నిర్వహించని రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్‌కుమార్ , ఫార్మసిస్టు రాజేంద్రప్రసాద్‌పై కలెక్టర్ దినేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మండలంలో గిన్నెలకోట,జామిగుడ గిరిజన గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. దీనిలో భాగంగా రూడకోట పీహెచ్‌సీని సందర్శించిన ఆయన బాధ్యతగా పనిచేయాలని సిబ్బందిని హెచ్చరించారు. పక్కనే ఉన్న బర్త్ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రూ.12 కోట్లతో చేపట్టిన రహదారి పనులను ఆయన తనిఖీ చేశారు. ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు జంక్షన్ నుంచి పిట్టలబొర్ర జలపాతం వరకు ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. నిధుల కొరత వల్ల నిలిచిపోయిన గిన్నెలకోట వంతెన పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తానని గిరిజన సంక్షేమ శాఖ ఈఈకి సూచించారు. జామిగుడ – గుంజివాడ గ్రామాల మధ్యలో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేస్తామని ఆయా ప్రాంతాల ప్రజలకు హామీ ఇచ్చారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రహదారి పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గిన్నెలకోట గ్రామంలో స్థానికుల వినతి మేరకు మొబైల్ ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుచేస్తామని చెప్పా రు. వికలాంగులకు సదరం ధ్రువపత్రాల జారీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దిగువకుమడలో పాఠశాలకు కొత్త భవనం మంజూరుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఇక్కడి విద్యార్థుల ఆధార్ నమోదుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. బూసిపుట్టు ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సదుపాయం కల్పనకు చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వేణుగోపాల్,ఏఈలు ధ్రువకుమార్, రాము, జబ్బర్, పీఆర్ డీఈ రవికుమార్, ఏఈ సంజీవరావు, ఎంపీడీవో విగ్గిన్స్ గిరిజన సంక్షేమ శాఖ , పంచాయతీరాజ్ ఏఈ సంజీవరావు, జామిగుడ సర్పంచ్ తెరవాడ అన్నమ్మ పాల్గొన్నారు.

'నాన్న గారూ.. మీ వయసు ఎంత'.. గిరిజనుడికి కలెక్టర్ ఆత్మీయ పలకరింపు

జామిగుడ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని పెదబయలు మండల మాజీ ఎంపీపీ జర్సింగి బాలంనాయుడు కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. ఆయన గురించి తెలుసుకున్న కలెక్టర్ ఎంతో ప్రేమతో మాట్లాడారు. అతనిని ఎత్తుకుని అభినందించారు. 'నాన్న గారూ.. మీ వయసు ఎంత' అని ఆయనతో ఆప్యాయంగా పలకరించారు. వందేళ్లు నిండాయని చెప్పడంతో కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. గతంలో స్వగ్రామం గుంజివాడ నుంచి పెదబయలు మండల కేంద్రానికి కాలినడకనే వెళ్లేవాడినని, వాహనాలు తిరుగుతున్నా నడకే తనకు ఇష్టమని బాలంనాయుడు తెలిపారు. మీరు ఇంకా ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఆయనతో కలెక్టర్ ఫొటో దిగారు.

దిగువకుమడ పాఠశాలకు నూతన భవనం

ముంచంగిపుట్టు: దిగువకుమడ పాఠశాలకు నూతన భవనం నిర్మిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కుమడ పంచాయతీ దిగువకుమడ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు పూరిపాకలు పాఠాలు బోధించడాన్ని ఆయన గుర్తించారు. పాఠశాలకు నూతన భవనానికి నిధులు మంజూరు చేసి,వెంటనే నిర్మాణ పనులు మొదలు పెడతామని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారంలు పంపిణీపై ఆరా తీశారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.అనంతరం బూసిపుట్టు గ్రామంలో పర్యటించారు. గిరిజనులతో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని తదితర సమస్యలపై వారు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. వీటిని దశల వారీగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు చింతూరులో పర్యటన

చింతూరు: కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం చింతూరులో పర్యటించనున్నారు. ఐటీడీఏ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొంటారు. సాయంత్రం జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహిస్తారు. వరదలు సంభవించినప్పడు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ఆయన అధికారులకు సూచనలిస్తారు.

ప్రొటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్‌సీపీ చింతూరు మండల కన్వీనర్ రామలింగారెడ్డి డిమాండ్

చింతూరు: పింఛన్ల పంపిణీ విషయంలో మండలంలోని గిరిజన ప్రజా ప్రతినిధులను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అధికారులు స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వలేదని, గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులకు సైతం సమాచారం ఇచ్చేవారని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వవద్దని ప్రభుత్వం ఆదేశాలిస్తే వాటిని తమకు చూపించాలని ఆయన కోరారు.

260 పాఠశాలల భవనాలకు ప్రతిపాదనలు

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

సీలేరు: జిల్లా పరిధిలోని 22 మండలాల్లో 260 పాఠశాలల భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు తెలిపారు. మంగళవారం సీలేరు జెడ్పీ పాఠశాలతోపాటు పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం నాడు-నేడు పనుల పేరును ఎస్ఐఐగా ప్రభుత్వం మార్చిందన్నారు. సీలేరు గిరిజన ఆశ్రమ పాఠశాలను పదో తరగతి వరకూ అప్‌గ్రేడ్ చేయాలని కింది స్థాయి అధికారుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అప్‌గ్రేడ్ పనులు త్వరితగతిన సాగేలా చూస్తామన్నారు. చింతూరు డివిజన్‌లోనూ మరో రెండు పాఠశాలలు అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందన్నారు. కేజీబీఎస్ పాఠశాలకు డిమాండ్ అధికంగా ఉందని, 40 సీట్లకే పరిమితం కావడంతో వాటి సంఖ్యను మరింత పెంచాలని ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి అనుమతి వచ్చేలా కృషి చేస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ, చదువుల్లో కానీ నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


డెంగ్యూ, మలేరియాపై అవగాహన కార్యక్రమం

రంపచోడవరం: వర్షకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ (మలేరియా) రామనాథం సూచించారు. జులై 1 నుంచి 30 వరకు డెంగ్యూ వ్యతిరేక మాసంగా పరిగణించడంతో మంగళవారం డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ


మైక్రోస్కోప్ ద్వారా మలేరియా నిర్ధారణ పరీక్షలు వివరిస్తున్న లక్ష్మి

రంపచోడవరం: మలేరియా నిర్ధారణ పరీక్షలపై ల్యాబ్ టెక్నీషియన్లకు స్థానిక మలేరియా కార్యాలయంలో మంగళవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో గల ల్యాబ్ టెక్నీషియన్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. రక్తపూతల సేకరణ, మైక్రోస్కోప్ ద్వారా పరీక్షా విధానం వివరించారు. సెంట్రల్ మలేరియా ల్యాబ్(సీఎంఎల్)కు చెందిన ఎంవీ లక్ష్మీ సుభద్ర (విజయవాడ) శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ డైరెక్టర్ రామనాథం, డీఎంవోల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

రేపు అల్లూరి జయంతి


అల్లూరి పార్కులో సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో జయరాం

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఈనెల 4న ఏఎల్ పురం (కృష్ణదేవిపేట) పార్కులో ఘనంగా నిర్వహించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. ఆయన మంగళవారం మండల, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కులో ఉన్న అల్లూరి సమాధుల వద్ద శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాళులర్పిస్తారని తెలిపారు. జయంతి సందర్భంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ హరితో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సముద్ర ఉత్పత్తుల రవాణాలో విశాఖ టాప్



- వరుసగా రెండో ఏడాది విశాఖ పోర్టు దేశంలోనే నంబర్‌వన్
- ఈ వాణిజ్య సంవత్సరంలో 3,14,199 టన్నుల ఎగుమతులు
- రూ.17,983 కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తుల నిర్వహణ
- పక్క రాష్ట్రాల చూపు కూడా విశాఖ పోర్టు వైపే
- ఎక్కువగా అమెరికా, చైనా, యూఏఈ తదితర దేశాలకు ఎగుమతులు

సాక్షి, విశాఖపట్నం: నౌకా నిర్మాణ కేంద్రంగా, తూర్పు నౌకాదళ ప్రధాన స్థావరంగా ఖ్యాతిగడించిన విశాఖ సిగలో మరో కీర్తికిరీటం చేరింది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో విశాఖపట్నం పోర్టు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. వరుసగా రెండో ఏడాది కూడా ఈ రికార్డును దక్కించుకుంది. అవసరాలకనుగుణంగా సామర్థ్యాన్ని పెంచుకుంటున్న విశాఖ పోర్టు అథారిటీ సరకు రవాణాలో సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ఈ ఏడాది ఏకంగా రూ.17,983 కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసింది. విశాఖ పోర్టు ఓవైపు మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీలు, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టుల పనులను శరవేగంగా చేపడుతోంది. మరోవైపు కార్గో రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తద్వారా దేశంలో మేజర్ పోర్టుల్లో నంబర్‌వన్‌గా నిలిచేందుకు అడుగులు వేస్తోంది.

ఎగుమతుల్లో అత్యధిక వాటా..

సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపెడా) నివేదికల ప్రకారం.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలోనే విశాఖపట్నం పోర్టు అత్యధిక వాటాను కలిగి ఉంది. 2023–24 వాణిజ్య సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోర్టుల నుంచి రూ.60,523.89 కోట్ల విలువైన 17,81,602 మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయి. ఇందులో ఒక్క విశాఖపట్నం పోర్టు నుంచే రూ.17,983 కోట్ల విలువైన 3,14,199 మెట్రిక్ టన్నులను ఎగుమతి చేయడం విశేషం. 2022–23లో దేశవ్యాప్తంగా రూ.63,969.14 కోట్ల విలువైన 17,35,286 మెట్రిక్ టన్నులను ఎగుమతి చేశారు. ఇందులో విశాఖ పోర్టు నుంచి రూ.16,876.93 కోట్ల విలువైన 2,64,214 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులున్నాయి.

విశాఖ వైపు పక్క రాష్ట్రాల చూపు..

పోర్టు పక్కనే ఫిషింగ్ హార్బర్.. దానికి ఆనుకుని సముద్ర ఉత్పత్తుల ఎగుమతి సంస్థలు ఎక్కువ సంఖ్యలో ఉండటమే విశాఖ పోర్టు మొదటి స్థానంలో ఉండటానికి ప్రధాన కారణం. దీంతోపాటు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అందించిన ప్రోత్సాహకాలు కూడా ఇందుకు దోహద పడుతున్నాయి. విశాఖ సమీప సముద్ర తీరంలో నాణ్యమైన మత్స్య, సంబంధిత ఉత్పత్తులు లభిస్తున్నాయి. దీంతోపాటు ఎగుమతులకు సరైన సౌకర్యాలు కూడా ఉండటంతో సమీప రాష్ట్రాలు కూడా విశాఖ వైపు మొగ్గు చూపుతున్నాయి. ముఖ్యంగా ఒడిశాకు చెందిన ఎగుమతిదారులు కూడా విశాఖ పోర్టుపైనే ఆధారపడుతుండటం కలిసొస్తున్న అంశంగా మారింది. ఈ కారణంగానే మహారాష్ట్ర, కొచ్చి, కోల్‌కతా పోర్టులను వెనక్కినెట్టి.. విశాఖపట్నం పోర్టు సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో నంబర్‌వన్‌గా నిలిచింది.

సరకు రవాణాలోనూ సత్ఫలితాలు

ఎగుమతులను ప్రోత్సహించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ సహకారం.. సరకు రవాణాలో సత్ఫలితాలను అందించాయి. విశాఖపట్నం పోర్టులో 32 బెర్తులుండగా.. సమీపంలోని గంగవరం పోర్టులో 9 బెర్తులున్నాయి. ఇందులో మొత్తం 23 బెర్త్‌ల ద్వారా కార్గో కంటైనర్ ఎగుమతులు జరుగుతున్నాయి. విశాఖ నుంచి ఎక్కువగా అమెరికా, చైనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), దక్షిణ కొరియా, ఇటలీ, వియత్నాం, జపాన్, కెనడా దేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. చానల్స్, బెర్తులను మరింత లోతుగా విస్తరించడం ద్వారా అంతర్గత వనరుల నుంచి సైతం ఆదాయం ఆర్జించేలా విశాఖ పోర్టు మార్గాలను అన్వేషిస్తోంది. ఎగుమతుల్లో వృద్ధికి ఉన్న అన్ని అంశాలను సద్వినియోగం చేసుకుంటూ విశాఖ పోర్టు జోరు కొనసాగిస్తోంది.

ఎగుమతుల ఫలితాలిలా..

పోర్టు	2022-23లో ఎగుమతుల విలువ (రూ.కోట్లలో)	2023-24లో ఎగుమతుల విలువ (రూ.కోట్లలో)
విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)	16,876.93	17,983.99
కొచ్చి	7,550.48	6,120
జేఎన్‌పీటీ (ముంబై)	5,892.69	6,395.70

వనామీ రొయ్యదే అగ్రస్థానం



భారత్ నుంచి 132 దేశాలకు సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాం. ఇందులో అమెరికా, చైనా ప్రధాన దిగుమతిదారులుగా నిలిచాయి. ఎగుమతుల్లో రొయ్యలు ప్రధాన పాత్ర పోషించాయి. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా దినదినాభివృద్ధి చెందుతున్న ఆక్వాకల్చర్ పరిశ్రమ విశాఖ పోర్ట్ మొదటి స్థానంలో నిలవడానికి ప్రధాన కారణం. వనామీ రకం రొయ్యలు అధికంగా ఉత్పత్తి కావడం, అదే సమయంలో ఎగుమతుల్లో ఇవే సింహభాగం ఉండటం కలిసొచ్చిన అంశం. ఒడిశాకు సంబంధించిన సముద్ర ఉత్పత్తులను ఇక్కడ నుంచే ఎగుమతి చేయడం కూడా పోర్ట్ మొదటి స్థానంలో నిలవడానికి మరో ముఖ్య కారణం. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలోనే విశాఖ ప్రథమ స్థానంలో నిలవడం పోర్ట్ పనితీరుకు అద్దం పడుతోంది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ ప్రాధాన్యతకు ఈ గణాంకాలే నిదర్శనం.

– డా.అంగముత్తు, చైర్మన్, విశాఖపట్నం పోర్టు

ఈ యాప్‌లలో బిల్లులు చెల్లించలేరు!


- ఫోన్‌పే, జీ పే, పేటీఎంలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు బంద్
- ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చెల్లింపులకు అవకాశం
- అందుబాటులోకి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్

విశాఖ సిటీ: యూపీఐల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే వినియోగదారులకు షాక్ తగిలింది. థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్ పే, జీ పే, పేటీఎం, ఇతర యూపీఐల ద్వారా నేరుగా చెల్లింపులకు బ్రేక్ పడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కొత్త నిబంధనల నేపథ్యంలో ఇకపై ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుంది.

ఇప్పటి వరకు విద్యుత్ వినియోగదారుల్లో కొంతమంది బిల్లులను రెవెన్యూ కౌంటర్ల వద్ద చెల్లిస్తున్నారు. మరికొందరు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా కడుతున్నారు. అత్యధిక వినియోగదారులు మాత్రం గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌లను వినియోగించి పేమెంట్ చేస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఈ యాప్‌ల ద్వారా చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటోంది. ఇకపై ఇలా చేయడం కుదరని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆర్బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

ఆర్‌బీఐ స్పష్టమైన ఆదేశాలు

బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఇతరుల పాత్రపై ఆర్‌బీఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బిల్లులు జారీ చేసే వారు కాకుండా ఇతరులు బిల్లులను వసూలు చేయడంపై ఆంక్షలు విధించింది. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ తాజా మార్గదర్శకాల ప్రకారం ఇకపై నేరుగా ఇలా బిల్లుల వసూలు సాధ్యం కాదు. థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించాలంటే బిల్లు జారీ చేసిన వారి ధ్రువీకరణ అవసరం. ఈ మేరకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా భారత్ బిల్ డెస్క్ నుంచి పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్లకు సమాచారం అందింది.



ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్

నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయం అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) బిల్లుల చెల్లింపు విషయంలో కూడా సులభతరమైన పేమెంట్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. సంస్థకు సంబంధించిన వెబ్‌సైట్ నుంచే కాకుండా మొబైల్ యాప్‌ను కూడా రూపొందించింది. ఇప్పటికే వీటిని ప్రజలకు చేరువ చేసింది.

గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్

వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలనుకుంటే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్లే స్టోర్‌లో easternpower అనే యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో అవసరమైన అనుమతులు ఇచ్చి నేరుగా సులువగా బిల్లులు చెల్లించుకోవచ్చు. అలాగే వైబ్‌సైట్ ద్వారా చెల్లించాలనుకుంటే www.apeasternpower.com ద్వారా పేమెంట్ చేసే అవకాశముంది. ఈ వెబ్‌సైట్ ద్వారా గానీ, మొబైల్ యాప్ ద్వారా గానీ బిల్లులు చెల్లించే సమయంలో వినియోగదారులు పేమెంట్ గేట్ వేగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లతో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డులను కూడా వినియోగించుకునే సౌకర్యం ఉంది. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు.

అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా కె. విజయ



సాక్షి, అనకాపల్లి: జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి బదిలీ అయింది. ఆయన స్థానంలో ప్రస్తుత సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ కె.విజయను కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కె.విజయ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్‌గా, ఉమ్మడి కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, ఏపీ టూరిజం సీఈఓగా, ఏపీ సీఆర్‌డీఏగా, ఏడాదిపాటు బాపట్ల కలెక్టర్‌గా పనిచేశారు. బాపట్ల జిల్లా తొలి కలెక్టర్‌గా 2022 ఏప్రిల్ 4 నుంచి 2023 ఏప్రిల్ 14 వరకు విధులు నిర్వహించారు. రవి పట్టన్‌శెట్టికి ప్రస్తుతానికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

ఆదర్శ ఐఏఎస్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్‌గా కె.విజయ రాజమండ్రిలో పనిచేస్తున్న సమయంలో ఆమె భర్త, ఇటీవల అల్లూరి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన దినేష్‌కుమార్ రంపచోడవరంలో ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహించేవారు. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమె రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ రోగుల మాదిరి పురుడు పోసుకొని ఆదర్శంగా నిలిచారు. ప్రజలను చైతన్యపరుస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందనే మనోధైర్యాన్ని కల్పించారు. ఐఏఎస్ దంపతులిద్దరూ ఆదర్శ కలెక్టర్లుగా పేరు తెచ్చుకున్నారు. కె.విజయ టూరిజం విభాగంలో పనిచేసిన సమయంలో అరకు బెలూన్ ఫెస్టివల్ నిర్వహణలో కీలకపాత్ర పోషించడమే కాకుండా 2019లో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో పూతరేకులు, 15 అడుగుల లాంగెస్ట్ బాంబో చికెన్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించడంలో కీలక పాత్ర పోషించారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం (విశాఖ) : పూరీ రథయాత్ర సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు పూరీకి నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెలలో పూరీలో గుండిచా యాత్ర, బహుదా యాత్ర, సునాబేష సందర్భంగా ఈ రైళ్లు ఆయా ప్రాంతాల నుంచి పూరీకి నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

- గుణుపూర్–పూరీ(08345) స్పెషల్ (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) ఈ నెల 4, 14, 16వ తేదీల్లో గుణుపూర్‌లో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.15 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–గుణుపూర్ (08346) స్పెషల్ ఈ నెల 7, 15, 17వ తేదీల్లో రాత్రి 9.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది.
- పలాస–పూరీ(08331) (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ ఈ నెల 7, 15, 17వ తేదీల్లో పలాసలో మధ్య రాత్రి 12.15 గంటలకు బయల్దేరి అదే రోజు తెల్లవారు 5.35 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–పలాస(08332) స్పెషల్ ఈ నెల 8, 16, 18వ తేదీల్లో తెల్లవారు 4 గంటలకు పూరీలో బయల్దేరి అదే రోజు ఉదయం 10 గంటలకు పలాస చేరుకుంటుంది.
- విశాఖపట్నం–పూరీ (08347) (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ విశాఖపట్నంలో ఈ నెల 6, 14, 16వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.45 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–విశాఖపట్నం (08348) స్పెషల్ పూరీలో ఈ నెల 8, 16, 18వ తేదీల్లో రాత్రి(తెల్లవారు) 1.45 గంటలకు బయల్దేరి అదే రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- జగదల్‌పూర్–పూరీ (08349) (హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ ఈ నెల 6, 14, 16వ తేదీల్లో ఉదయం 10.45 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 12.45 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–జగదల్‌పూర్ (08350) స్పెషల్ పూరీలో ఈ నెల 8, 16, 18వ తేదీల్లో రాత్రి 12.15 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 3.10 గంటకు జగదల్‌పూర్ చేరుకుంటాయి.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని 11 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు పాడేరు గిరిజన గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా బాలురకు 76, బాలికలకు 84 సీట్లను పెంచినట్టు పేర్కొన్నారు. డుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాలలో బాలురకు 14, బాలికలకు 12, కొయ్యూరులో బాలురకు 10, బాలికలకు 10, అరకులో బాలురకు ఆరు, బాలికలకు ఐదు, పాడేరులో బాలురకు తొమ్మిది, బాలికలు రెండు చొప్పున సీట్లు కేటాయించినట్టు తెలిపారు. హుకుంపేటలో బాలురకు 4, బాలికలకు 9, జి.మాడుగులలో బాలురకు 4, బాలికలకు 5, చింతపల్లిలో బాలురకు రెండు, బాలికలకు నాలుగు, జీకే వీధిలో బాలురకు ఐదు, బాలికలకు ఐదు, ముంచంగిపుట్టులో బాలురకు 12, బాలికలకు 15, పెదబయలులో బాలురకు 6, బాలికలకు 8, అనంతగిరిలో బాలురకు నాలుగు, బాలికలకు ఎనిమిది సీట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. 63 ఆపై మార్కులు వచ్చిన బాలురు, 65 ఆపై మార్కులు వచ్చిన బాలికలు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 4న ఉదయం 10 గంటలకు పాడేరు గిరిజన గురుకుల పాఠశాలకు హాజరు కావాలన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పోర్టు సందర్శన

విశాఖ సిటీ: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ప్రమేశ్వర్ ఫంక్వాల్ మంగళవారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించారు. ఆయనతో పాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వై.నాగేంద్రబాబు, వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ఉన్నారు. వీరికి పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు పోర్టులో రైల్వే సైడింగ్స్‌ను తనిఖీ చేశారు. ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్, ఇతర నిర్వహణ అంశాలను విచారించారు. అనంతరం విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించారు. పోర్టు చైర్‌పర్సన్ అంగముత్తు, రైల్వే జనరల్ మేనేజర్ బృందం పలు ఉపయుక్తమైన అంశాలపై చర్చించారు. రైల్వే లైన్ల ఎలక్ట్రిఫికేషన్, నవీకరణ, ఎక్కువ బోగీల వినియోగం, రైల్వే ద్వారా సరుకు తరలింపు వంటి వివిధ రైల్వే సమస్యలపై సమీక్షించారు. అల్యూమినియం, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ముఖ్యమైన వస్తువుల రవాణాలో పెరుగుదలపై కూడా చర్చించారు.

ఇసుకాసురులకు చెక్

ప్రజల కోసం సిద్ధం చేసిన ఇసుక అది. గత ప్రభుత్వం గృహనిర్మాణ లబ్ధిదారులకు ఉచితంగాను, ఇతరులకు నామమాత్రపు ధరలకు సరఫరా చేసేది. నక్కపల్లి వద్ద ఏర్పాటు చేసిన డిపోలో నిల్వ ఉంచిన కోట్లాది రూపాయల విలువైన ఇసుకపై ఇప్పుడు మాఫియా కళ్లు పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వ పెద్దల సహకారంతో తరలించుకుపోయేందుకు స్కెచ్ వేసినట్టు సమాచారం. స్థానికులు సహసించి అడ్డుకోవడంతో వారి ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి.

- ప్రభుత్వ ఇసుకపై మాఫియా కళ్లు
- చీకట్లో తరలించేందుకు సన్నాహాలు
- స్థానికులు అడ్డుకోవడంతో అక్రమార్కులకు బ్రేక్
- నక్కపల్లి డిపో వద్ద వేలాది టన్నుల నిల్వలు
- విలువ రూ.1.50 కోట్లు పైమాటే..
- ప్రభుత్వంలోని కొందరు పెద్దల ప్రోద్బలంతోనే ఇసుకను మాయం చేసేందుకు యత్నాలు

నక్కపల్లి: ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకుని మాఫియాకు కళ్లెం వేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తూ ఇసుకను ప్రభుత్వమే ప్రజలకు విక్రయించేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా నక్కపల్లి జాతీయ రహదారిని ఆనుకుని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఇసుక డిపోను ఏర్పాటు చేసింది. రాజమండ్రి గోదావరి నది నుంచి ఇసుకను తీసుకువచ్చి ఇక్కడ నిల్వ చేసి కాంట్రాక్ట్ దక్కించుకున్న ప్రైవేటు సంస్థ ద్వారా ఇసుక విక్రయాలు చేపట్టింది. ప్రభుత్వ చర్యల వల్ల గడచిన ఐదేళ్లు లబ్ధిదారులకు ఇసుక కొరత రాలేదు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేశారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి టన్ను రూ.1400లకు విక్రయించారు. ఐదేళ్లపాటు ఇక్కడ ఇసుక డిపో సాఫీగానే జరిగింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నక్కపల్లి డిపో వద్ద ఇసుక విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం ఈ డిపోలో సుమారు 8 వేల నుంచి 10 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఇక్కడ ఇసుకను స్థానికంగా ఉన్న కొంతమంది వ్యక్తులు సుమారు 30 లారీల్లో తరలించుకుపోయినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న మైనింగ్ అధికారులు ఇసుక నిల్వల వద్దకు వెళ్లకుండా చుట్టూ ట్రెంచ్ తవ్వించారు.


నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుక నిల్వలు

పెద్దల అండతోనే.. : ప్రభుత్వం మారడంతో ప్రాధాన్యాలు కూడా మారాయి. గతంలో ప్రజలకు సక్రమంగా సరఫరా చేసేందుకు తపన పడితే.. ఇప్పుడు అక్రమార్కులకు కొమ్ములు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇసుకపై కొంతమంది పెద్దల కళ్లు పడ్డాయి. వేల టన్నుల ఇసుకను రాత్రి పూట మాయం చేసేందుకు స్కెచ్ వేశారు. మంగళవారం విజయవాడకు చెందిన కొంతమంది మాఫియా నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుక నిల్వలను రాత్రికి రాత్రే తరలించుకుపోవడానికి ప్రయత్నించారు. జేసీబీలను తీసుకు వచ్చి తవ్వకాలు జరిపి లారీల్లో లోడ్ చేసేందుకు తాత్కాలికంగా మార్గం ఏర్పాటు చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రభుత్వంలో ఉన్న కొంతమంది పెద్ద నేతల ప్రోద్బలంతోనే నక్కపల్లి డిపోలో ఉన్న ఇసుకను విజయవాడ తరలించి అక్కడ విక్రయించి కోట్లు సంపాదించేందుకు సన్నాహాలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇసుకకు గిరాకీ ఎక్కువగా ఉంది. ట్రాక్టర్ ఇసుక (5 టన్నులు) సుమారు రూ.6 వేలకు పైబడే ఉంది. ఈ లెక్కన వేల టన్నుల్లో ఇక్కడ ఉచితంగా లభిస్తున్న ఇసుకను కోట్లాది రూపాయలకు విక్రయించి అక్రమంగా కోట్లు సంపాదించుకునేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయల విలువ చేసే ఇసుక తరలిపోకుండా మైనింగ్ అధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుక విలువ సుమారు రూ.1.50 కోట్లు పైబడే ఉంటుందని తెలుస్తోంది. ఇసుకను తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై సీఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం రావడంతో పోలీసులను పంపించామన్నారు. దాంతో అక్కడ నుంచి సదరు వ్యక్తులు వెళ్లిపోయారన్నారు. ప్రస్తుతం ఇసుక డిపో వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇసుక తరలించేందుకు ఉపయోగించిన వాహనాలు, జేసీబీ ఎవరిదనే విషయంపై విచారణ జరుపుతున్నామన్నారు. ఇసుకను తరలించకుండా ట్రెంచ్ తవ్వించామని చెప్పారు.


మంగళవారం రాత్రి ఇసుక తరలించకుండా ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం